గ్రామాల్లో ప్రగతి పరుగులు

- ఇప్పటికే రూ.100 కోట్లతో అభివృద్ధి
- అదనంగా మరో రూ.30 కోట్ల మంజూరు
- గ్రావెల్ రోడ్లకు రూ.6 కోట్లు



పొదలకూరు పట్టణంలో నిర్మిస్తున్న సిమెంటురోడ్డు (ఫైల్)

పొదలకూరు : పట్టణ, గ్రామాల్లో ముమ్మరంగా సిమెంటు రోడ్లు, సైడ్‌డ్రెయిన్ పనులు జరిగాయి. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం పూర్తయ్యేనాటికే మండలంలో రూ.100 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా నియోజకవర్గానికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పాటు, నుడా నుంచి నిధులను సాధించి పనులను చేయించారు. పొదలకూరు పట్టణంలో ముమ్మరంగా సిమెంటురోడ్లు, డ్రెయిన్ల పనులను పూర్తి చేశారు. అవసరమైతే అదనంగా కూడా నిధులను విడుదల చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల మిగిలిపోయిన పనులకు అదనంగా మరో రూ.30 కోట్లను మంజూరు చేయించారు. ఆ పనులు కూడా శరవేగంగా జరిగాయి. గ్రామాల్లో పొలాలకు వెళ్లేందుకు వీలుగా గ్రావెల్ రోడ్ల నిర్మాణానికి మార్కెటింగ్ శాఖ ద్వారా రూ.6 కోట్లు మంజూరయ్యాయి. ఈ రోడ్లు రైతుల పొలాలకు వెళ్లేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత సిమెంటు రోడ్డు, సైడ్ డ్రెయిన్ లేని కొన్ని కాలనీలకు ఆ వసతులు సమకూర్చడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రతి కాలనీలో సిమెంటు రోడ్లు, సైడ్‌డ్రెయిన్ల పనులు పూర్తి కావస్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలిన సైడ్‌డ్రెయిన్ల పనులను మంత్రి కాకాణి చొరవ తీసుకుని నిర్మించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

51 నెలల్లో అభివృద్ధి

ప్రభుత్వం ఏర్పడిన 51 మాసాల్లో సంక్షేమంతో పాటు, అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. మండలంలోని గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులు గత ఐదేళ్ల టీడీపీ పాలనలో జరిగింది లేదని ఆయా గ్రామస్తులు వెల్లడిస్తున్నారు. నీరు–చెట్టు పథకంలో రైతులకు ఉపయోగం లేని పనులను టీడీపీ ప్రభుత్వం చేపట్టినట్టుగా చెబుతున్నారు. చెక్ డ్యామ్‌లను నిర్మిస్తే ఇటీవల కురిసిన వర్షాలకు అవి కొట్టుకుపోవడంతో పాటు, కొన్ని ప్రాంతాల్లో దెబ్బతిన్నాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే సీసీరోడ్లు, డ్రెయిన్లతో పాటు సచివాలయ, ఆర్బీకే, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలను నిర్మించింది. వీటి ద్వారా ప్రజలకు అన్నిరకాల మేలు జరుగుతోంది.



గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన సైడ్‌డ్రెయిన్

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేషాలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి మంగళవారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం పల్లకిసేవ గావించారు.

కొత్త పింఛన్ అందజేత



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పొదలకూరు : పట్టణంలోని కేఆర్‌ఆర్ నగర్లో కొత్తగా మంజూరైన పింఛన్‌ను వలంటీర్ ద్వారా వార్డుసభ్యుడు ఎస్‌కే అంజాద్ మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ వెరిఫికేషన్ అనంతరం వృద్ధురాలికి పింఛన్ మంజూరు కావడంతో రూ.2,750 నగదును ఆమె ఇంటి వద్ద అందజేశారు.

హెచ్‌ఎంకు ప్రశంసా పత్రం


Certificate of Participation
MyGov & Ministry of Education congratulate
Tatiparthi Venkateswarlu
for successfully completing the G-20 Summit Quiz. We acknowledge your efforts. Keep participating..!

హెచ్‌ఎంకు పంపిన ప్రశంసాపత్రం

కొడవలూరు : మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాటిపర్తి వెంకటేశ్వర్లుకు ఎన్‌సీఈఆర్టీ నుంచి ప్రశంసా పత్రం లభించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో జీ–20 శిఖరాగ్ర సదస్సు విజయవంతంగా నిర్వహించినందుకు గానూ కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించింది. ఇందులో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు ప్రతిభ చూపడంతో ఎన్‌సీఈఆర్టీ నుంచి హెచ్‌ఎంకు ఆన్‌లైన్‌లో మంగళవారం ప్రశంసా పత్రం పంపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీ–20 శిఖరాగ్ర సదస్సు మన దేశంలో జరుపుకోవడం మనందరికీ గర్వకారణమన్నారు.

గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): నగరంలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని టీవీఎస్ కల్యాణ సదన్‌లో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, కోశాధికారి మోహన్‌రావు మాట్లాడారు. నగరంలో వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులు, అధికారులకు సమన్వయ వారధిగా కార్యాలయం పనిచేయనుందని వివరించారు. నగరంలోని అన్ని గణేశ్ ఉత్సవ మండపాల నిర్వాహకులతో విస్తృత స్థాయి సమావేశాన్ని టీవీఎస్ కల్యాణ సదన్‌లో బుధవారం ఉదయం 10.30కు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సమితి సభ్యులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, రంగరాజన్, కృష్ణారెడ్డి, చంద్ర, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా నగరోత్సవం



నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమిని పురస్కరించుకొని ఎన్టీఆర్‌నగర్‌లో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలు మంగళవారంతో ముగిశాయి. కృష్ణ భగవానుడి నగరోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. వేదిక అధ్యక్షుడు సురమౌళి, రవి, హరికృష్ణ, చంద్రమోహన్, వెంకటరమణయ్య, కమిటీ సభ్యులు లక్ష్మయ్య, ప్రదీప్, నరసింహ ప్రసాద్, రత్నం, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పారిశుద్ధ్య సామగ్రి పంపిణీ

కొడవలూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో పారిశుద్ధ్య సామగ్రిని పంపిణీ చేశారు. వీటిని ఎంఈఓ జి.వసంతకుమారి చేతుల మీదుగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు మంగళవారం అందజేశారు. మండలంలో 80 ప్రభుత్వ పాఠశాలలుండగా వాటిలో 160 మరుగుదొడ్లు ఉన్నాయి. వీటికి అవసరమైన అన్నిరకాల పారిశుద్ధ్య సామగ్రిని ప్రభుత్వం సరఫరా చేసింది. లాంగ్ హ్యాండిల్ బాత్‌రూమ్ వైపర్స్ 160, రీఫిల్ వైపర్‌లు 160, లాంగ్ హ్యాండిల్ మాప్‌లు 160, రీఫిల్ మాప్‌లు 160, లాంగ్ హ్యాండిల్ హార్డ్ బ్రిస్టల్ బ్రష్‌లు 240, టాయిలెట్ బ్రష్‌లు 320 వంతున మండలానికి రాగా, వీటన్నింటినీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుద్ధ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు అవసరమైన అన్నిరకాల సామగ్రిని సకాలంలో పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు హైస్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వర్లు, సీఆర్పీలు ఎం.దయాకర్, పెంచలరావు, మస్తాన్ పాల్గొన్నారు.



హెచ్‌ఎం వెంకటేశ్వర్లుకు పారిశుద్ధ్య సామగ్రిని అందజేస్తున్న ఎంఈఓ

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి



ఇందుకూరుపేట : కొరుటూరులో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

తోటపల్లిగూడూరు : చిన్నారులకు తగినంత పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి సూచించారు. మండలంలోని చిన్నచెరుకూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా మాసోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తగిన పౌష్టికాహారం అందినప్పుడే చిన్నారులు ఆరోగ్యకరంగా, పుష్టిగా ఉంటారన్నారు. ఈ క్రమంలో పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోషకాహారం తగినంత అందకపోతే చిన్నారుల్లో రక్తహీనత, ఇతర వ్యాధులు సక్రమించే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పక బలవర్థకమైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పేడూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు అనూరాధ, లావణ్య, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

ఇందుకూరుపేట : గర్భిణులు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు విధిగా చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల సూచించారు. మండలంలోని కొరుటూరులో పోషణ్ మహా మాసోత్సవ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోని పక్షంలో ప్రసవ సమయంలో సమస్యలు వస్తాయన్నారు. అంతే కాకుండా శిశువు ఆరోగ్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారంతో పాటు తక్కువ ధరకు లభ్యమయ్యే ఆకుకూరలు, చిరుధాన్యాలను తీసుకోవడం ద్వారా పోషకాహార లోపం తలెత్తకుండా ఉండొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, జ్యోతి, అనూరాధ, భారతి తదితరులు పాల్గొన్నారు.



తోటపల్లిగూడూరు : సూచనలు చేస్తున్న ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

మనుబోలు : మండల పరిధిలో ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 27 వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద ప్రజలకు వారి ఇళ్ల ముంగిటకే వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో సర్వే నిర్వహించి ఎవరెవరికి ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నాయో ముందుగా గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలను వారి ఇళ్ల వద్దకే అందజేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 15 నుంచి గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు. దీనిని పక్కాగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ శివకృష్ణయ్య, సీహెచ్‌ఓ రాజయ్య, ఏఓ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాజు

నేడు పొదలకూరుకు మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు పొదలకూరుకు వస్తారని ఎంపీడీఓ నగేష్‌కుమారి మంగళవారం తెలిపారు. పట్టణంలోని బిట్–2 సచివాలయ భవనం, రైతుబజార్, పట్టణంలో సిమెంటురోడ్లను మంత్రి ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలియజేశారు.

నేటి నుంచి క్రీడా జట్ల ఎంపికలు

ఇందుకూరుపేట : మండలస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా జట్ల ఎంపికలు బుధవారం నుంచి జరుగుతాయని ఎంఈఓ ఎంవీ సునీల్‌కుమార్, హెచ్‌ఎం వి.మల్లికార్జున మంగళవారం తెలిపారు. తొమ్మిది క్రీడాంశాల్లో అండర్–14, 17 విభాగంలో బాల బాలికల జట్లకు ఎంపికలు జరుగుతుందన్నారు. ఎంపికైన జట్లు త్వరలో కోవూరులో జరగబోయే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఎంపికల్లో పాల్గొనవచ్చన్నారు. కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, బ్యాడ్మింటన్ ఎంపికలు కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం నిర్వహిస్తామన్నారు. వాలీబాల్, టెన్నికాయిట్, యోగా ఎంపికలు గురువారం కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతాయన్నారు. అథ్లెటిక్స్, ఖోఖో ఎంపికలు 16న నరసాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతాయని వివరించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

వేడుకగా కుంభాభిషేకం



నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని శివాజీ సెంటర్‌లో గల వరసిద్ధి వినాయక దేవస్థాన వార్షిక కుంభాభిషేకాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. వరసిద్ధి వినాయకస్వామికి పంచామృత నవకలశాభిషేకాలు, గణపతి హోమం, పూర్ణాహుతి, మహాకుంభప్రోక్షణ, తదితర పూజలను ఆలయ అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, రంగరాజన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామశర్మ, వేదపారాయణదారుడు వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో జరిపారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు మల్లు రామ్మోహన్‌రెడ్డి, గూడంశెట్టి దొరబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి

బుచ్చిరెడ్డిపాళెం : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా లోక్ అదాలత్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి అన్నారు. మండలంలోని సాల్మన్‌పురంలో ప్రపంచ మానవహక్కుల సంఘం చైర్మన్ మూరంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయంలో వినియోగిస్తున్న పురుగు మందుల వల్ల భవిష్యత్‌లో మన పిల్లలు పూర్తిగా విష ఆహారం తీసుకునే పరిస్థితి వస్తుందన్నారు. అలాగే మనం వాతావరణం పట్ల చేస్తున్న తప్పుల వల్ల వర్షాలు సక్రమంగా పడటం లేదని గుర్తుచేశారు. అలాగే తల్లిదండ్రుల ఆస్తి వాటాల్లో ఆడ పిల్లలకు కూడా సమాన హక్కు ఉంటుందని, దీనిపై అనుమానం ఉన్నా.. న్యాయం జరగకపోయినా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చన్నారు. ముఖ్యంగా చిన్నారుల చేత వెట్టిచాకిరి చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి వాటిని ప్రోత్సహించడం దారుణమన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని కోరారు. అలాగే న్యాయస్థానంలో కేసులు ఉన్న సమయంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తామని తెలియజేశారు. అనంతరం గత పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థిని వైష్ణవిని సన్మానంచారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు పీపీ కె.జగదీష్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ రాజశేఖర్, ఎంపీడీఓ శ్యామ్, డీటీ విజయ్‌కుమార్, ఎంపీటీసీ నారాయణ, వైఎస్సార్‌సీపీ నేత జయరామిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

బుచ్చిరెడ్డిపాళెం : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని మండల రెండో విద్యాశాఖాధికారి పీవీ రత్నం అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో డెటాల్ బనేగా స్వస్థ ఇండియా సహకారంతో విద్యార్థులకు డెటాల్ హైజిన్ ఒలింపియాడ్ 2.0 పరీక్షలు మంగళవారం నిర్వహించారు. వీటిని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత అవసరాలు తీర్చుకున్న తరువాత, అలాగే భోజనానికి ముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. అలాగే ప్రతిరోజు స్నానం చేసి మంచి దుస్తులు ధరించాలన్నారు. దీని వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వివిధ పాఠశాలల్లో నిర్వహించే స్వచ్ఛ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన, వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్, ఆయా పాఠశాలల హెచ్‌ఎమ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎంఈఓ–2 రత్నం

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

వెంకటాచలం : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 38వ వర్ధంతిని వెంకటాచలం మండల కేంద్రంలో రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటాల గురించి పలువురు నాయకులు మాట్లాడారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం మండల కార్యదర్శి పొట్టేపాళెం సుధాకర్, ముత్తిపాటి మాల్యాద్రి, పాతపాటి ఏడుకొండలు, పట్టపు కృష్ణ, దాసరి వెంకయ్య, మస్తానయ్య, ఓడూరు వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజకులు

భూసర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూర్ణిమ

తోటపల్లిగూడూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని నెల్లూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూర్ణిమ సూచించారు. మండలంలో సమగ్ర భూసర్వే కార్యక్రమానికి సంబంధించి మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మంగళవారం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో సమగ్ర భూసర్వే కార్యక్రమం చక్కగా సాగుతోందన్నారు. దీనికి సంబంధించి 18 రకాల రికార్డులకు తయారు చేయాల్సి ఉందని, వాటిని పకడ్బందీగా చేపట్టేలా సిబ్బందికి తగిన సూచనలు ఇస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శిస్తూ కార్యక్రమ స్థితిగతులను తెలుసుకుంటున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుని సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ లావణ్య, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



భూసర్వే రికార్డులు పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పూర్ణిమ

వెంకయ్యస్వామి సన్నిధికి 17న పాదయాత్ర

నెల్లూరు(బృందావనం): భగవాన్ వెంకయ్యస్వామి దివ్యసన్నిధి గొలగమూడికి నెల్లూరు నుంచి పాదయాత్రను ఈ నెల 17న చేపట్టనున్నామని నగరంలోని సాయిదర్బార్ అద్దాల మందిర చైర్మన్ మధుసాయి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మందిరంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పాదయాత్రలో పాల్గొనాలనుకునే భక్తులు 88856 44118, 95028 49784 నంబర్లను ఈ నెల 15లోపు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

జీవితంలో ఉన్నతంగా ఎదగాలి

నెల్లూరు(బృందావనం): విద్యార్థులు ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకొని.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలని వీఎస్‌యూ వైస్ చాన్సలర్ సుందరవల్లి పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 501 మంది విద్యార్థులకు రూ.9.18 లక్షల నగదు బహుమతులు, సర్టిఫికెట్లను పురమందిరంలో మంగళవారం అందజేశారు. ఇంటర్నేషనల్ హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగపట్నం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తన సొంత నిధులను విద్యాప్రగతికి అందజేస్తున్న సుబ్రహ్మణ్యాన్ని అభినందించారు. అనంతరం డీఈఓ గంగాభవానీ మాట్లాడారు. అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించి తల్లిదండ్రులు, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కాంక్షించారు. ఏటా రూ.20 లక్షల నిధులను అందజేస్తున్నానని సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజు, డాక్టర్లు గంగపట్నం సుధ, పెనుగొండ రవిశంకర్, ప్రధానోపాధ్యాయుడు తిరుమలరాజు, ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు, కల్పం రమేష్, ఉద్దండి అమరలింగం, మోహన్‌రెడ్డి, తిరుమలయ్య, నలుబోలు బలరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుందరవల్లి